సాక్షి నిర్మల్

సోమవారం । 28 । ఏప్రిల్ । 2025



గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై ఆశలు

ఎడారి దేశాలకు వలస వెళ్లినవారు వివిధ కారణాలతో మృతి చెందుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించింది. 8లో▸



ఘనంగా బీఆర్ఎస్ రజతోత్సవం

జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ రజతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గులాబీ జెండాలు ఆవిష్కరించిన నాయకులు వరంగల్‌లో నిర్వహించిన సభకు తరలివెళ్లారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం 38.0 /27.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. సాయంత్రం చిన్నపాటి వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

'మన్ కీ బాత్' వీక్షణ



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యేలు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రధాని మోదీ 121 వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో వీక్షించారు. ఆయనతోపాటు ముధోల్, సిర్పూర్ ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పాల్వాయి హరీశ్‌బాబు ఉన్నారు.

గజ్జలమ్మ దేవికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, అర్చన, హారతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి పల్లకి సేవ నిర్వహించగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

బీరప్పకు ప్రత్యేకపూజలు



పూజలు చేస్తున్న పూజారులు

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో బీరప్ప కల్యాణ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం కురుమ సంఘం నాయకులు, పూజారులు ఆలయంలో కలశపూజ, గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం చెరువులో లింగాల వెలికితీత కార్యక్రమం నిర్వహించగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తిలకించారు. వెలికి తీసిన లింగాలకు పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయానికి చేర్చారు. సోమవారం బీరప్ప కల్యాణం, ఉత్సవమూర్తి ఊరేగింపు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు బూర్ల పోతన్న, బంగ్ల భోజన్న, రాయిడి చిన్న, గ్యానెడి దేవన్న తెలిపారు.

ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగాలు సాధించినవారితో నాయకులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వెంకటాద్రి పేట్ కాలనీలోని మున్నూరు కాపు సంఘం, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ప్రభుత్వ ఉద్యోగం సాధించిన పలువురిని సంఘ కార్యాలయంలో ఆదివారం శాలువాలతో సన్మానించి పూల మొక్కలు అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అనుముల రఘునాథ్, మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు గొజ్జ సుదర్శన్, నాయకులు నరహరి, గొజ్జ బాబు, అనుముల రామకృష్ణ, లక్కాకుల నరేందర్, కూన సందీప్, చుక్క సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



హాల్‌టికెట్ నంబర్లు చూస్తున్న విద్యార్థులు

కుంటాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఆరో తరగతిలో ప్రవేశానికి ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 374 విద్యార్థులకు 275 మంది హాజరు కాగా 99మంది గైర్హాజరయ్యారు. ఏడోతరగతి నుంచి పదో తరగతి వరకు మిగులు సీట్ల భర్తీకి మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 216 మందికి 136 మంది హాజరుకాగా 80 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సీఎస్ నవీన్‌కుమార్, డీవో మహేందర్ తెలిపారు. పరీక్షాకేంద్రాన్ని డీఈవో రామారావు తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రం వద్ద ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

విద్యానిధి ఏది?

- ఏటా కొంతమందికే రుణసాయం
- పథకాలపై కొరవడిన అవగాహన
- అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం
- నెరవేరని నిరుపేద విద్యార్థుల కల



డిగ్రీ పూర్తి చేసి విదేశాల్లో ఉన్నతవిద్య అభ్యసించాలనుకునే నిరుపేద విద్యార్థులకు విద్యానిధి పథకాల ద్వారా ప్రభుత్వం చేయూతనిస్తోంది. ఒక్కో విద్యార్థికి గరిష్టంగా రూ.20 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తోంది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం అంబేడ్కర్ ఓవర్సీస్, మైనార్టీ విద్యార్థుల కోసం సీఎం ఓవర్సీస్, బీసీ విద్యార్థుల కోసం మహాత్మా జ్యోతిబాపూలే విద్యానిధి పథకాలను అమలు చేస్తోంది. 2015–16 నుంచి ఎస్సీ, ఎస్టీలకు, 2016–17 నుంచి బీసీలకు, 2017 నుంచి మైనార్టీలకు ఈ పథకాలు రుణసాయం అందిస్తున్నాయి. విదేశీ విద్య పథకాలను సద్వినియోగం చేసుకునే విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ప్రారంభమైన పదేళ్లలో జిల్లా నుంచి ఎనిమిది మంది, సీఎం ఓవర్సీస్‌కు 20 మంది, మహాత్మా జ్యోతిబాపూలే విద్యానిధి పథకానికి 20 మంది మాత్రమే ఎంపికైనట్లు సమాచారం. ఇందుకు పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కొరవడడమే.

– నిర్మల్‌చైన్‌గేట్

అర్హతలు, షరతులు

ఇంజినీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, వ్యవసాయం, నర్సింగ్, సామాజిక శాస్త్రాల కోర్సుల్లో డిగ్రీలో కనీసం 60శాతం మార్కులు సాధించాలి. టోఫెల్‌లో 60శాతం, ఐఈఎల్‌టీఎస్‌లో 80 మార్కులు, జీఆర్ఈ, జీమ్యాట్‌లో ఉత్తీర్ణత, పీఈటీలో 50శాతం మార్కులు కలిగి ఉండాలి. 35 ఏళ్లలోపు ఉండి, తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షల్లోపు ఉండాలి. గతంలో అమెరికా, ఇంగ్లాండ్, కెనడా, ఆస్ట్రేలియా లాంటి దేశాల్లోని యూనివర్సిటీల్లో చదివే విద్యార్థులకే ఈ పథకం వర్తించేంది. ఇప్పుడు దక్షిణ కొరియా, సింగపూర్, న్యూజిలాండ్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్‌లోనూ వైద్య విద్య, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, ప్యూర్ సైన్స్, వ్యవసాయం, సామాజిక శాస్త్రాలు, హ్యూమానిటీస్ లాంటి కోర్సుల్లో పీజీ చేసే అవకాశం విద్యార్థులకు కల్పించారు.

దరఖాస్తు విధానం ఇలా..

కులం, ఆదాయం, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ మార్కుల జాబితా, టోఫెల్, ఐఈఎల్‌టీఎస్, జీఆర్ఈ, జీమ్యాట్, పీఈటీ అర్హత సర్టిఫికెట్లు, విదేశీ యూనివర్సిటీ నుంచి ప్రవేశ అనుమతి పత్రం, ప్రవేశ రుసుము చెల్లించిన రశీదు, బ్యాంక్ ఖాతా వివరాలు కలిగి ఉండాలి. అర్హులు telanganaepass. cgg. gov. in ద్వారా ఆన్‌లైన్‌లో లేదా మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. రూ.10 విలువైన నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్‌పై రిజిస్ట్రార్ సంతకంతో కూడిన ఆదాయ ధ్రువీకరణ పత్రం జత చేయాలి. ఎస్సీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలోని కమిటీ దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తుంది. ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి కోసం మే 19 వరకు, బీసీ సంక్షేమ శాఖ ద్వారా మహాత్మా జ్యోతిబాపూలే విద్యానిధి కోసం ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలి.

సద్వినియోగం చేసుకోవాలి



విదేశాల్లో చదువుకోవాలనే ఆసక్తి కలిగినవారికి మహాత్మా జ్యోతిబా పూలే విద్యానిధి ద్వారా ప్రభుత్వం రూ.20 లక్షల రుణమిస్తోంది. జిల్లా నుంచి ఇప్పటివరకు 20 మంది విదేశాలకు వెళ్లారు. అర్హులు వినియోగించుకోవాలి.

– శ్రీనివాస్, బీసీ సంక్షేమశాఖ అధికారి

10 దేశాల్లో చదువుకోవచ్చు



అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం దళిత విద్యార్థులకు వరం లాంటిది. ఏటా రూ.10లక్షల చొప్పున రెండేళ్లు రూ.20 లక్షల రుణసాయం అందజేస్తున్నాం. 10 విదేశాల్లో చదువుకునేందుకు ఈ పథకం దోహదపడుతుంది.

– రాజేశ్వర్‌గౌడ్, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి

అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం వివరాలు

ఎస్సీ, ఎస్టీ (08), మొత్తం సొమ్ము: 1,57,69,000

సంవత్సరం	వచ్చిన దరఖాస్తులు	లబ్ధి పొందిన సొమ్ము (లక్షల్లో)
2016	1	20.68
2017	1	19.33
2018	1	20.68
2023	4	76.37
2024	1	20.63

ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం (మైనార్టీ): 10
సొమ్ము: రూ.2.06 కోట్లు

సంవత్సరం	వచ్చిన దరఖాస్తులు	లబ్ధి పొందిన సొమ్ము (లక్షల్లో)
2017	1	20.60
2018	1	20.60
2019	2	41.20
2020	1	20.60
2021	2	41.20
2022	2	41.20
2023	1	20.60

మహాత్మాజ్యోతిబాపూలే (బీసీ): 20
సొమ్ము: రూ.3,83,37,000

సంవత్సరం	వచ్చిన దరఖాస్తులు	లబ్ధి పొందిన సొమ్ము (లక్షల్లో)
2017	2	40.00
2018	1	20.69
2019	2	30.67
2020	5	103.85
2021	3	61.56
2022	4	70.74
2023	2	40.24
2024	1	15.62

మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

- 296 మంది మైనర్ల పట్టివేత
- 100 మందిపై కేసులు నమోదు



నిర్మల్ టౌన్ పీఎస్‌లో మైనర్లు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న రాజేశ్ మీనా

నిర్మల్‌టౌన్: ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో మైనర్ డ్రైవింగ్‌పై ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సుమారు 296 మంది మైనర్లు వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడగా 100 మందిపై కేసులు నమోదు చేశారు. అనంతరం మైనర్ల తల్లిదండ్రులకు భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా మోటార్ వాహన చట్టాలపై అవగాహన కల్పించారు. రెండో విడత కౌన్సెలింగ్ మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ ఉపేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఇవ్వనున్నట్లు తెలిపారు. నిర్మల్ పట్టణంలో ఏఎస్పీ రాజేశ్‌మీనా, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించగా 10 ద్విచక్ర వాహనాలు పట్టుబడ్డాయి. భైంసా టౌన్‌లో 10 ద్విచక్ర వాహనాలు, నిర్మల్ రూరల్ పరిధిలో ఐదు, భైంసా రూరల్‌లో రెండు ద్విచక్ర వాహనాలు, రెండు ట్రాక్టర్లు, ఖానాపూర్ పట్టణంలో ఆరు, కుభీర్‌లో మూడు, కుంటాలలో ఆరు, బాసరలో ఐదు, లోకేశ్వరం ఏడు, ముధోల్‌లో నాలుగు, తానూరులో ఆరు, దస్తురాబాద్‌లో నాలుగు, కడెంలో నాలుగు, పెంబిలో ఒకటి, దిలావర్‌పూర్‌లో మూడు, నర్సాపూర్‌లో మూడు, సారంగపూర్‌లో ఏడు, లక్ష్మణచాందలో ఆరు, మామడలో రెండు, సోన్‌లో నాలుగు ద్విచక్ర వాహనాలను ఆయా స్టేషన్ల పరిధిలోని పోలీసులు పట్టుకున్నారు.

'సరిహద్దు'లో క్షీరవిప్లవం



తానూరులోని హోటల్‌లో పాలు విక్రయిస్తున్న ఈ రైతు పేరు పోతన్న. ఇతనికి మూడు గేదెలున్నాయి. రోజూ ఉదయం, సాయంత్రం 16 లీటర్ల పాలు ఇస్తాయి. వీటిని గృహాలు, హోటళ్లకు సప్లయ్ చేస్తాడు. మిగిలిన వాటితో పెరుగు, నెయ్యి తయారు చేసి విక్రయిస్తాడు. స్వచ్ఛమైన నెయ్యి కావడంతో కిలో రూ.800కు అమ్ముతున్నాడు. పశుపోషణతో అధిక లాభాలున్నాయని పోతన్న చెబుతున్నాడు. ఇలా మండలంలోని చాలా మంది రైతులు పాడి పశువుల పెంపకం ద్వారా లాభాలు గడిస్తున్నారు.



బోంద్రట్‌లో ఆవులకు మేత వేస్తున్న రైతు

- వ్యవసాయంతోపాటు పశుపోషణ
- ఇంటింటా ఆవులు, గేదెల పెంపకం
- హోటళ్లు, గృహాల్లో పాల విక్రయం
- లాభాలు గడిస్తున్న పశుపోషకులు

తానూరు: మహారాష్ట్ర సరిహద్దులోగల మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఇంటింటా పాడి పశువులు పెంచుతున్నారు. వ్యవసాయం చేసుకుంటూనే పాల దిగుబడి సాధిస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. మండలంలోని హిప్నెల్లి, బెంబర, బోరిగాం, బోల్సా, బోసి, వర్‌జడి, కోలూరు, మసల్గతండా, బోంద్రట్ గ్రామాల్లో ఇంటింటా ఆవులు, గేదెలున్నాయి. పూర్వీకుల నుంచి పశుపోషణ ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. ఈ గ్రామాల ప్రజలు మద్యం, మాంసానికి దూరంగా ఉంటూ.. పాలు, పాల ఉత్పత్తులనే అధికంగా వినియోగిస్తారు. అందుకే ఏ ఇంటా చూసినా తప్పనిసరిగా ఆవులు లేదా గేదెలను పెంచుకుంటారు.

లాభదాయకం కావడంతోనే..

తమ ఇళ్లలో పెంచుకుంటున్న పాడి పశువులు ఇచ్చే పాలను రైతులు విక్రయించి లాభాలు గడిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళలో తీసిన పాలను సమీపంలోని హోటళ్లు, గృహాలకు సప్లయ్ చేస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో లీటర్ పాలను రూ.50 నుంచి రూ.60 వరకు విక్రయిస్తారు. కిలో పెరుగును రూ.80 వరకు విక్రయించి లాభాలు గడిస్తున్నారు. పశువులను అధికంగా పెంచుకుంటున్న రైతులు పాలు, పెరుగు, నెయ్యి వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. పశువులను పోషించగా వాటి ద్వారా వచ్చే పాలను విక్రయించడమే కాకుండా పేడను సేంద్రియ ఎరువుగా పంటలకు వేస్తుంటారు. పంటల సాగులో సేంద్రియ ఎరువులు వినియోగిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

పశువుల కాపరులకు ఉపాధి

గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పోషించుకుంటున్న ఆవులు, గేదెలతో పశువుల కాపర్లకు కూడా ఉపాధి దొరుకుతోంది. నెలకు ఒక్కో ఆవును మేపినందుకు రూ.500, గేదెకు రూ.600 తీసుకుంటారు. ఉదయం వేళ పశువుల కాపరులు ఇంటింటికీ చేరుకుంటారు. పశువులను అటవీ ప్రాంతానికి తోలుకెళ్తారు. అక్కడ దినమంతా అవి మేత మేసిన తర్వాత సాయంత్రం తిరిగి ఇంటికి చేరుస్తారు.

లాభాలు అధికమే..



ఇంట్లో ఆవులు, గేదెలు పెంచుకుంటే ఎన్నో లాభాలున్నయ్. పాలు అమ్ముకుంటం. రసాయన ఎరువులు తగ్గించి పేడతో తయారు చేసిన సేంద్రియ ఎరువును పొలాలకు వినియోగిస్తున్నం. దీంతో దిగుబడి బాగా వస్తున్నది.

– శంకర్, రైతు, తానూరు

ఇంటి అవసరాలకే..



మాకు ఒక ఆవు ఉంది. ప్రతీరోజు నాలుగు లీటర్ల పాలు ఇస్తున్నది. రోజువారీ అవసరాలకు పోనూ మిగతావాటితో పెరుగు, నెయ్యి తయారు చేసి అమ్ముకుంటం. బయట కొన్న పాలు కల్తీగా ఉంటుండడంతో తప్పనిసరిగా ఇంటింటికీ ఆవులను పెంచుకుంటున్నం.

– మాదవ్‌రావ్, రైతు, ఉమ్రి(కే)

ఉపాధి దొరుకుతున్నది



గ్రామంలోని పశువులన్నింటినీ మేతకు తీసుకువెళ్తా. నెలకు ఆవుకు రూ.500, గేదెకు రూ.600 చొప్పున రైతులు ఇస్తరు. సాయంత్రం క్షేమంగా ఎవరి పశువులను వారింటికి చేరుస్త. దీంతో నాకు ఉపాధి దొరుకుతున్నది.

– నాగోరావ్, పశువుల కాపరి, హిప్నెల్లి

అ'పూర్వ'ం.. అద్వితీయం



కడెం: ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన 2004-05 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు

కడెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004–05లో పదో తరగతి చదివిన వారంతా ఆదివారం మండలంలోని కొండుకూర్ గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం పేరిట కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు 20 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని సందడి చేశారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులను ఆహ్వానించి శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని బ్రహ్మపురి కాలనీలోగల శ్రీసరస్వతి శిశుమందిర్ ప్రాథమిక పాఠశాలలో 1993–94లో ఎస్సెస్సీ పూర్తి చేసినవారంతా స్థానిక ఉత్సవ్ ఫంక్షన్‌హాల్‌లో కలుసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు.



నిర్మల్ చైన్‌గేట్: సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

హిందువులపై దాడులు తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న పద్మశ్రీ

భైంసాటౌన్: హిందువులపై దాడులను ఐకమత్యంతో తిప్పికొట్టాలని వీహెచ్‌పీ మాతృశక్తి సంయోజక్ పద్మశ్రీ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని పులేనగర్ శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో అభ్యాస వర్గ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హిందువులంతా ఐక్యంగా ఉంటేనే ఎలాంటి ఆపదనైనా ఎదుర్కోవచ్చని తెలిపారు. ఇందుకుగాను ప్రతిరోజూ మందిర కేంద్రంగా సత్సంగ్ నిర్వహించుకోవాలని, తద్వారా హిందూసమాజం జాగృతం కావాలని సూచించారు. కార్యక్రమంలో విభాగ్ కార్యదర్శి తమ్మల కృష్ణ, ప్రాంత మాతృశక్తి సహ సంయోజక్ శ్రీవాణి, జిల్లా అధ్యక్షుడు జాదవ్ విఠల్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్, కార్యదర్శి మూర్తి ప్రభు, సహ కార్యదర్శి నవీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

'రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన కేసీఆర్ కుటుంబం'



మాట్లాడుతున్న రితేశ్ రాథోడ్

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం అప్పుల పాలు చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేసేందుకే బీఆర్ఎస్ రజతోత్సవ సభ నిర్వహించిందని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. నాయకులు భస్వపురం లక్ష్మీనర్సయ్య, అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, మెడిసమ్మ రాజు, నల్లా రవీందర్‌రెడ్డి, ఒడిసెల అర్జున్, ఆకుల కార్తిక్, సుంకరి సాయి తదితరులు పాల్గొన్నారు.

29న డీసీసీ కార్యవర్గ సమావేశం

నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 29న జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ రోడ్డులోగల మారుతి ఇన్ హోటల్ డీసీసీ ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నిర్మల్, ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు. సమావేశానికి పీసీసీ పరిశీలకులు చంద్రోశేఖర్‌గౌడ్, అవేజ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

మద్యం పట్టివేత

ఇచ్చోడ: బజార్‌హత్నూర్ మండల కేంద్రానికి చెందిన తోట త్రిశూల్ శనివారం రాత్రి మహారాష్ట్ర నుంచి నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ (సుంకం చెల్లించని మద్యం) తరలిస్తుండగా ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు. ఆదివారం ఇచ్చోడ సీఐ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. పట్టుకున్న మద్యం విలువ రూ.19,200 ఉంటుందన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో సెల్‌పాయింట్ దగ్ధం



పరిశీలిస్తున్న ఫైర్ అధికారి శ్రీనివాస్

జన్నారం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సెల్ పాయింట్ దగ్ధమైన సంఘటన మండలంలోని కలమడుగులో చోటు చేసుకుంది. బాధితుడు మల్లేశ్ తెలిపిన వివరాల మేరకు శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో తాళం వేసి ఇంటికి వెళ్లాడు. రాత్రి 11.30 గంటల ప్రాంతంలో షాపు లోపలి నుంచి మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వడంతో మంటలు ఆర్పివేశారు. ఆదివారం ఉదయం ఫైర్ అధికారి శ్రీనివాస్ సంఘటన స్థలాన్ని సందర్శించారు. ఘటనలో మొత్తం రూ.16 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ఫైర్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

గంజాయి సేవిస్తున్న ఏడుగురు అరెస్ట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం సబ్బేపల్లి శివారులో గంజాయి సేవిస్తున్న ఏడుగురిని ఆదివారం అరెస్టు చేసినట్లు హాజీపూర్ ఇన్‌చార్జి ఎస్సై రామయ్య తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించగా పోలీసుల రాకను గమనించిన ఏడుగురు వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. అందులో ఆరుగురిని పోలీసులు పట్టుకోగా ఒకరు పరారయ్యారు. వారి నుంచి 70 గ్రాముల గంజాయి, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కేసీఆర్‌పై యువకుడి అభిమానం



కేసీఆర్ కటింగ్‌తో యువకుడు

తలమడుగు: మండల కేంద్రానికి చెందిన మాండ సంతోష్ కేసీఆర్‌పై తన అభిమానం చాటుకున్నాడు. తలపై కేసీఆర్, బీఆర్‌ఎస్ అక్షరాలు కనిపించేలా కటింగ్ చేయించుకుని ఆదివారం చలో వరంగల్ సభకు బయలుదేరి వెళ్లాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

ఇంటి చుట్టూ పెంకుల పైకప్పుతో భవంతి



పెంకుల పైకప్పుతో చల్లదనాన్ని ఇస్తున్న ఇల్లు



1977లో నిర్మించిన పెంకుటిళ్లు



దండేపల్లి మండలం మాదాపూర్‌లో మిద్దె ఇల్లు



అలనాటి ఇళ్లలో..చల్లగా.. హాయిగా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. దీంతో పేదల ఇళ్లలో ఫ్యాన్లు, మధ్య తరగత ఇళ్లలో కూలర్లు, ఎగువ మధ్య తరగతి నుంచి సంపన్నుల ఇళ్లలో ఏసీలు 24 గంటలూ నడుస్తున్నాయి. అయినా వాటికింద ఉన్నంతసేపే వేడి నుంచి ఉపశమనం పొందుతున్నారు. కాసేపు బయటకు వెళ్లినా వేడి తట్టుకోలేకపోతున్నారు. కానీ ఉమ్మడి జిల్లాలోని పాత కాలంనాటి ఇళ్లలో ఉంటున్నవారు మాత్రం మండువేసవిలోనూ చల్లగా.. హాయిగా ఉంటున్నారు. ఎక్కువ ఎత్తుతో కట్టిన మట్టి మిద్దెలు, ఎక్కువ గ్రీనరీతో నిర్మించుకున్న పురాతన ఇళ్లలో ఫ్యాన్ గాలి చల్లదనం సరిపోతుందని పేర్కొంటున్నారు. నాటి నిర్మాణ శైలి, నిర్మాణానికి ఉపయోగించిన సామగ్రి కారణంగా నేటికీ ఉష్ణోగ్రతలు ఎంత పెరిగినా ఆ ఇళ్లలో వేడిగా ఉండదని యజమానులు చెబుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



నిర్మల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లిలో ఇప్పటికీ అందంగా కనిపిస్తున్న పెంకుటిళ్లు

ఏసీ, కూలర్ అవసరం లేదు



మాదీ నిర్మల్ రూరల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లి. ఎస్సారెస్పీ రియాబిటేషన్ విలేజ్ కావడంతో 1977లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం భూములు కోల్పోయిన వారికి విశాలమైన ఇళ్ల స్థలాలు ఇచ్చింది. మాది ఉమ్మడి కుటుంబం కావడంతో మా మామయ్యలు ఎంతో ఆసక్తితో చుట్టూ బంతి ఇల్లు నిర్మించారు. వేసవికాలంలో ఎలాంటి ఏసీ, కూలర్ అవసరం ఉండదు. అందుకే ఇప్పటికీ అతి పురాతనమైన ఈ ఇంట్లోనే నివాసం ఉంటున్నాం. – ఉమారెడ్డి, రత్నాపూర్ కాండ్లి, నిర్మల్

చల్లగానే ఉంటుంది



మా నాన్నలు ఇద్దరు అన్నదమ్ములు. మేము నలుగురం అన్నదమ్ములం. 1970లో కలిసికట్టుగా బంతి ఇల్లు నిర్మించుకున్నాం. అప్పటి నుండి ఇప్పటి వరకు మా అన్నదమ్ములం ఇదే ఇంట్లో కలిసే ఉంటున్నాం. ఇంటి పైకప్పుకు వేపచెక్కలు కొట్టి వాటిపై మట్టిముద్దలు వేసి పైన గూనపెంకలు పేర్చారు. అందుకే వేసవికాలంలో ఎండలు ఎంతగా ముదిరినా మా ఇంట్లో మాత్రం చల్లగానే ఉంటుంది. – లింగన్న, రత్నాపూర్ కాండ్లి, నిర్మల్

చల్లదనం పంచుతుంది



మాది రత్నాపూర్ కాండ్లి. మేము ఇద్దరం అన్నదమ్ములం. 1970లో రూ.50 వేలు ఖర్చుచేసి బంక మట్టి ముద్దలు, సున్నపురాయి కలిపి ఇంటిగోడలు నిర్మించాం. ఇంటి పైకప్పుపై మట్టిముద్దలు పేర్చి దానిపై గూనపెంకలు పేర్చాం. అందుకే వేసవి కాలంలో కూడా మాఇల్లు చల్లదనాన్ని పంచుతుంది. – ముత్తన్న, రత్నాపూర్ కాండ్లి, నిర్మల్

డంగుసున్నంతో నిర్మించాం



దండేపల్లి: మాది మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని మాదాపూర్. 90 ఏళ్ల క్రితం డంగుసున్నంతో మిద్దె ఇల్లు (భవంతి) నిర్మించాం. సాధారణ ఇళ్లకంటే ఎక్కువ ఎత్తులో నిర్మించాం. ఇప్పటికీ మాఇంట్లో ఫ్యాన్లు తప్పా కూలర్లు, ఏసీలు వాడం. మండు వేసవిలోనూ ఎంతో చల్లగా ఉంటుంది. 90 ఏళ్లు దాటినా ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది. – వీరమనేని సుభద్ర, మాదాపూర్, దండేపల్లి, మంచిర్యాల

వ్యవసాయరంగం బలోపేతానికి కృషి

- ఎంపీ గోడం నగేశ్



ప్రధాని మోదీ ప్రసంగం వింటున్న ఎంపీ నగేశ్

ఇంద్రవెల్లి: వ్యవసాయ రంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని పిట్టబొంగరంలో ఏర్పాటు చేసిన మన్‌కీ బాత్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రసంగాన్ని రైతులకు రేడియో ద్వారా వినిపించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రైతుల ఆర్థికాభివృద్ధికోసం నిరంతరం కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే మన్‌కీ బాత్ కార్యక్రమంలో హార్టికల్చర్ విభాగంలో పండ్ల మొక్కల పెంపకంపై రైతులకు సలహాలు, సూచనలు చేయడం గొప్ప విషయమన్నారు. ప్రతీరైతు పండ్ల మొక్కల పెంపకంపై దృష్టి సారించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా పిట్టబొంగరం, దస్నాపూర్, ధర్మగూడ, బట్టగూడ గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, నాయకులు మారుతి దేవ్‌పూజే, శివకుమార్ జైస్వాల్, ముండే రాజేశ్వర్, దిలీప్ మోరే, రాథోడ్ భీంరావ్, మెస్రం తుకారాం, కనక హనుమంత్‌రావ్, కోవ రాజేశ్వర్, గేడం యేశ్వంత్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో బంగారు పతకాలు



బంగారు పతకాలతో క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: ఈనెల 24 నుంచి 26 వరకు హనుమకొండలోని జేఎన్‌ఎస్ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ 7వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సబ్ జూనియర్ బాలికల జట్టు ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. ఆదివారం క్రీడాకారులు మంచిర్యాల రైల్వేస్టేషన్‌కు చేరుకోగా అసోసియేషన్ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికారు. జట్టు కెప్టెన్‌గా వ్యవహరించిన అమూల్య, కోచ్ సునార్కర్ అరవింద్, మేనేజర్ సాయిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, కోశాధికారి రమేశ్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రెటరీ రఘునాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న చిన్నారులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బాల కేంద్రానికి చెందిన చిన్నారులు జాతీయస్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచారు. మహారాష్ట్రలోని వార్ధాలో ఈనెల 25, 26 తేదీల్లో రాష్ట్రీయ కళామంచ్, సచిన్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి నృత్యోత్సవ పోటీల్లో విజేతలుగా నిలిచారు. జూనియర్, సబ్ జూనియర్ విభాగంలో కూచిపూడి ఈవెంట్లో దువాస హర్షిని, కోంద్ర అలేఖ్య ప్రథమ స్థానంలో, జాహ్నవి క్షీరసాగర్ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు బాలకేంద్రం పర్యవేక్షకుడు మిట్టు రవి తెలిపారు. జూనియర్ విభాగంలో ప్రథమస్థానంలో వర్ధిని, ద్వితీయ స్థానంలో శ్రీనిధి, సబ్ జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో ఇతీక్ష కొంకటి, ద్వితీయ స్థానంలో రితీక్షా జంగిలి, ప్రాపర్టీ రౌండ్లో సన్నిధి దేశ్‌ముఖ్, హర్షిని ఠాకూర్ ప్రథమ స్థానంలో నిలిచారు. మహారాష్ట్ర వేదికగా జరిగిన పోటీల్లో బాలకేంద్రం చిన్నారులు ఇప్పటివరకు మూడు పర్యాయాలు ప్రథమ స్థానంలో నిలిచారని నిర్వాహకులు వెల్లడించారు.

కల్మలపేటలో వృద్ధుడి హత్య!

- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



బద్ది లచ్చయ్య(ఫైల్)



రక్తపు మడుగులో లచ్చయ్య మృతదేహం

వేమనపల్లి: గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో వృద్ధుడు హత్యకు గురైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని కల్మలపేటకు చెందిన బద్ది లచ్చయ్య (64) మొదటి భార్య మధునక్క మృతి చెందగా లక్ష్మి అనే మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరు భార్యలకు నలుగురు కుమారులు నారాయణ, పోచన్న, రాములు, తిరుపతి ఉన్నారు. లచ్చయ్య కౌలు వ్యవసాయం, గుడుంబా అమ్ముకుంటూ అదేఇంట్లో వేరే గదిలో ఉంటున్నాడు. శనివారంరాత్రి చిరుజల్లులు కురుస్తుండగా తన ఎక్స్‌ఎల్ వాహనంపై బయటకు వెళ్లివచ్చాడు. తెల్లారేసరికి ఇంట్లో రక్తపు మడుగులో పడి ఉన్నాడు. గమనించిన కోడలు సమ్మక్క ఏడుస్తూ కొడుకులకు చెప్పడంతో విషయం బయటకు పొక్కింది. గుర్తు తెలియని వ్యక్తులు హత్యకు ఉపయోగించిన ఎడ్లబండికి ఉండే గడుగొయ్య అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. పెద్ద కొడుకు నారాయణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. ఘటన స్థలాన్ని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు , చెన్నూర్‌రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై శ్యాంపటేల్ పరిశీలించారు.

‘గిరి’ విద్యార్థులకు ఏఐ బోధన

- నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ
- రాష్ట్ర వ్యాప్తంగా 15 బ్యాచ్‌లు
- ఉమ్మడి జిల్లాలో 1,450 మందికి తర్ఫీదు

ఐటీడీఏ పరిధిలోని గిరిజన పాఠశాలలు, ఉపాధ్యాయుల వివరాలు
రెగ్యులర్ ఉపాధ్యాయులు : 878
అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు : 26
సీఆర్‌టీలు : 528
ఉన్నత పాఠశాలలు : 126
ప్రాథమిక పాఠశాలలు : 950



ఆసిఫాబాద్‌లోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాల

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యావ్యవస్థలో నూతనంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకునేందుకు గిరిజన సంక్షేమశాఖ సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో గిరిజన విద్యార్థులకు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) ద్వారా విద్యాబోధన అందించాలని భావించింది. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐటీడీఏ పరిధిలోని ప్రాథమిక, ఆశ్రమోన్నత పాఠశాలల్లో ఎంపిక చేసిన ఉపాధ్యాయులు, సీఆర్టీలు, అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లకు నేటి నుంచి ఆన్‌లైన్ మాధ్యమంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకు 15 బ్యాచ్‌లను తయారు చేశారు. ఒక్కో బ్యాచ్‌కు 350 నుంచి 400 మంది టీచర్లు క్లాసులు వినేలా ప్రణాళికలు చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని ఉపాధ్యాయులు ఈ నెల 26, 28 తేదీల్లో ఏఐటూల్స్‌పై శిక్షణ పొందనున్నారు. ఇప్పటికే జిల్లా పరిషత్ లోకల్ బాడి పాఠశాలల్లో ఎంపిక చేసిన 3, 4, 5వ తరగతుల విద్యార్థులకు ఏఐ విద్య కొనసాగుతుండగా కొంతమార్పు వచ్చింది. రీడింగ్, రైటింగ్ స్కిల్స్ పెరిగాయి. గణితంలోనూ లెక్కలు చేయగలుగుతున్నారు. ఇదే తరహాలో గిరిజన ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఏఐ విద్యాబోధన అందించాలని గిరిజన సంక్షేమశాఖ సంకల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి మే 30 వరకు ఆన్‌లైన్ తరగతులు కొనసాగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 5,560 మంది ఉపాధ్యాయులు ఏఐపై శిక్షణ తీసుకోనుండగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలో గల 1,450 మంది ఆన్‌లైన్ వేదికగా ఆన్‌లైన్ శిక్షణలో పాల్గొననున్నారు.

ఉమ్మడి జిల్లాకు 26, 28 తేదీల్లో..

రాష్ట్రవ్యాప్తంగా 15 బ్యాచ్‌లను తయారు చేయగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని ఉపాధ్యాయులకు మే 26న 13వ బ్యాచ్‌లో ఆదిలాబాద్, నిర్మల్, 28న 14వ బ్యాచ్‌లో కుమురం భీం, మంచిర్యాల జిల్లాల ఉపాధ్యాయులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4:45 గంటల వరకు ఆరు సెషన్‌లలో సబ్జెక్టుల వారీగా తరగతులు కొనసాగుతాయి.

సిగ్నల్స్ లేక.. పాఠాలు వినక

కోవిడ్ కారణంగా అనేక మంది విద్యార్థులు చదువులో వెనుకబడి పోయారు. ఐటీడీఏ పరిధిలోని ఆన్‌లైన్ బోధనలకు అవరోధాలు ఏర్పడ్డాయి. ఉమ్మడి జిల్లాలో అనేక ప్రాంతాల్లో సిగ్నల్స్ లేకపోవడంతో చాలామంది ఆన్‌లైన్ తరగుతులకు దూరమయ్యారు. కొన్నిచోట్ల సిగ్నల్స్ ఉన్నప్పటికీ డేటా సరిపోక పోవడంతో మధ్యలోనే అంతరాయం ఏర్పడేది. చివరకు ఏపాఠం చెబుతున్నారో.. తామేం వింటున్నమో అనేంతగా విద్యార్థుల్లో గందర గోళం ఏర్పడింది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సిగ్నల్స్‌కు అంతరాయం లేకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

శిక్షణలో పాల్గొనాలి

నేటికాలంలో ఏఐ విద్యాబోధన విద్యార్థులకు ఎంతో ఆవశ్యకమైంది. కాలానుగుణంగా బోధనలో మార్పులు తేవడానికి గిరిజన సంక్షేమ శాఖ ప్రయత్నాలు చేస్తోంది. ఐటీడీఏ పీవో ఆదేశానుసారంగా మేలో కొనసాగే ఏఐ టూల్స్ పై ఎంపిక చేసిన ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొనాలి. విద్యారంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలి. – పుర్క ఉద్దవ్, ఏసీఎంవో, కుమురంభీం

గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై ఆశలు..

ఉన్న ఊర్లో ఉపాధిలేకనో.. గల్ఫ్ దేశాలకు వెళ్తే జీవనం మెరుగుపడుతుందనో.. తమ కుటుంబాలు బాగుపడతాయనో.. కారణం ఏదైనా కావచ్చు.. ఉమ్మడి జిల్లా నుంచి రెండు దశాబ్దాలకుపైగా ఎడారి దేశాలకు వలసలు క్రమంగా పెరుగుతున్నాయి. అయితే విధి నిర్వహణలో అనారోగ్యం రీత్యా, ప్రమాదాల బారిన పడి, అక్కడి వాతావరణ పరిస్థితులు అనుకూలించక.. పలుకారణాలతో మృత్యువాత పడుతున్న ఘటనలు ఎన్నో ఉన్నాయి. వారిపై ఆధారపడిన బాధిత కుటుంబాలు సామాజికంగా, ఆర్థికంగా కొట్టుమిట్టాడుతున్న పరిస్థితులు ఉమ్మడి జిల్లాలో కోకొల్లలు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే 15 రోజుల క్రితం ప్రత్యేక సలహా మండలిని ఏర్పాటు చేసింది. వారి జీవన విధానంపై అధ్యయనం చేసేందుకు అవకాశం కల్పించింది. నేడు అంతర్జాతీయ కార్మికుల స్మారక దినోత్సవం సందర్భంగా కథనం.

- బాధిత కుటుంబాల భరోసాకు ప్రభుత్వం కార్యాచరణ
- ప్రత్యేక సలహా మండలి ఏర్పాటు
- నేడు అంతర్జాతీయ కార్మికుల స్మారక దినోత్సవం



స్వగ్రామంలో గల్ఫ్ కార్మికుడి మృతదేహం (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గల్ఫ్ దేశాలైన దుబాయ్, మస్కట్, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఇరాక్, ఇరాన్, కువైట్ తదితర దేశాలకు రెండు దశాబ్దాలకు ముందు నుంచే వలసలు ప్రారంభం అయ్యాయి. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి దాదాపు 70 వేలకు పైగా మంది కార్మికులు వివిధ గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్నట్లు సమాచారం. కాగా ఎక్కువమంది నైపుణ్య రహిత కార్మిక రంగంలోనే ఉపాధి పొందేందుకు వెళుతుండడంతో అక్కడి పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం వల్ల అనారోగ్యం బారిన పడడం, ఒత్తిడికి గురికావడం, ప్రమాదాల బారిన పడటం వంటి అనేక కారణాలరీత్యా తనువు చాలిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం తీసుకునే విధానపరమైన నిర్ణయాలపై సలహాలు, సూచనలు అందించేందుకు ప్రత్యేక గల్ఫ్ సంక్షేమ సలహా మండలిని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీనికి విశ్రాంత ఐఎఫ్‌ఎస్ అధికారి బీఎం వినోద్ కుమార్‌ను చైర్మన్‌గా, 12 మందిని సభ్యులుగా నియమించింది. ఇందులో నిర్మల్ జిల్లాకు చెందిన స్వదేశ్ పరికిపండ్లకు అవకాశం కల్పించింది. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన గల్ఫ్ బాధిత కుటుంబాల్లో కాసింత భరోసా కల్పించినట్లు అయింది.

మృతుల కుటుంబాలకు పరిహారం..

గల్ఫ్ దేశాల్లో మృత్యువాత పడిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల పరిహారం అందజేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా నుంచి రెండు దశల్లో ఈ పరిహారం ఆయా బాధిత కుటుంబాల ఖాతాల్లో ఇప్పటికే జమ అయ్యాయి.

అమలుచేయాల్సినవి ఇవే..

- ఎన్నారై పాలసీ అమలు
- ఏజెంట్ల మోసాలకు అడ్డుకట్ట వేయడం
- ఎంబసీలో తెలుగు అధికారుల నియామకం
- మృతదేహాలను స్వస్థలాలకు తీసుకురావడం
- అంత్యక్రియలకు ఆర్థికసాయం
- బాధిత కుటుంబాలకు పరిహారం
- వివిధ కారణాలతో అక్కడి జైళ్లో మగ్గుతున్న కార్మికులకు న్యాయ సహాయం
- ప్రమాద ఆరోగ్య బీమా అమలు
- నైపుణ్య శిక్షణ కార్యక్రమాల నిర్వహణ
- తిరిగివచ్చిన కార్మికులకు పునరావాసం

నేడు నిర్మల్‌లో ప్రత్యేక కార్యక్రమం

అంతర్జాతీయ కార్మిక స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఉదయం 9 గంటలకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. విధి నిర్వహణలో గాయపడిన లేదా మృతి చెందిన, అంగవైకల్యం పొందిన కార్మికుల స్మారకార్థం ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ కార్మికుల స్మారక దినోత్సవం నిర్వహిస్తున్న నేపథ్యంలో ‘చనిపోయిన వారిని స్మరించండి–బతికున్న వారికోసం పోరాడండి’ అనే నినాదంతో టీపీసీసీ ఎన్నారై విభాగం ఆధ్వర్యంలో ‘అమరుల దినోత్సవం’ నిర్వహించనున్నట్లు గల్ఫ్ కార్మిక సంక్షేమ రాష్ట్ర సలహా మండలి సభ్యులు స్వదేశ్ పరికిపండ్ల తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

నస్పూర్: సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మూన్ లైట్ బార్ బిల్డింగ్ సెల్లార్ కింద వాష్ రూమ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు సీఐ ఆకుల అశోక్ తెలిపారు. బార్ యజమాని ఆదివారం సెల్లార్ కిందకు వెళ్లి చూడగా దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం అందించాడు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు నాలుగు రోజుల క్రితం మృతి చెందినట్లు ఉండన్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి గుర్తు తెలియని స్థితిలో ఉందన్నారు. బార్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ పుటేజీ ఆధారంగా విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



రాకేశ్‌రెడ్డి (ఫైల్)

బోథ్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు ధన్నూర్(బి) గ్రామానికి చెందిన ముసుగు రాకేశ్‌రెడ్డి (37), ముద్దం రాజు ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై బోథ్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా సాయినగర్ కాలనీ వద్ద పెట్రోల్ పంపు సమీపంలో ఎదురుగా వచ్చిన టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో 108లో బోథ్‌లోని సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిర్మల్ జిల్లా కేంద్రానికి తరలిస్తుండగా రాకేష్‌రెడ్డి మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.